# స్పెయిన్, పోర్చుగల ట్రావెలాగ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి



*(గత సంచిక తరువాయి)*

<u>14-9-2015</u>

ఉదయం హోటల్ గదిలోని ఫోన్ అలారం మోగగానే ఏడుకి నిద్రలేచాను. అప్పటికే పద్మజ లేచింది.

ఏడుం ముప్పావుకి బ్రేక్‌ఫాస్ట్‌కి వెళ్ళాం. పదార్థాలన్నీ నిన్నటిలానే ఉన్నాయి. బ్రెడ్, మార్మలేడ్, కివీ ఫ్రూట్స్ మాత్రమే మేం తినగలిగినవి ఉన్నాయి. కాఫీ, టీ, ఆరెంజ్ జ్యూస్‌లు కూడా ఉన్నాయి.

ఎనిమిదిన్నరకి బయటకి వచ్చి కాసేపు రోడ్ వెంబడి నడిచాం. యూరోపియన్ రోడ్లలా శుభ్రంగా, క్రమశిక్షణ గల ట్రాఫిక్‌తో ఉంది ఆ రోడ్. తొమ్మిదికి మళ్ళీ హోటల్ లాబీకి చేరుకున్నాం. బస్ రాగానే దాన్ని ఎక్కాం.

"ఇవాళ ఎక్కువ భాగం ప్రయాణంలోనే గడుపుతాం. పోర్చుగల్‌కి బై చెప్పి సాయంత్రం ఐదుకి స్పెయిన్‌లోని సెవిల్‌కి చేరుకుంటాం" దీపక్ చెప్పాడు.

బస్ బయలుదేరాక తోటి పర్యాటకుడు రమేష్ బస్‌లోని అందరికీ ఇండియానించి తెచ్చిన చాక్లెట్లని పంచాడు.

కొద్దిసేపయ్యాక మళ్ళీ వచ్చి వాటి రేపర్స్‌ని చెత్త సంచిలో వేయించుకున్నాడు. బాంబేలో తనకి సూపర్ మార్కెట్స్ చెయిన్ ఉందని తనని పరిచయం చేసుకున్నప్పుడు చెప్పాడు.

తొమ్మిదిన్నరకి మా కోచ్ టాగస్ నది మీది వాస్కో డ గామా బ్రిడ్జ్‌ని దాటింది. అక్కడ నది చాలా విశాలంగా ఉంది. ఇండియాలో ఇంత విశాలమైన నదిని చూడలేదు.

"మీరంతా తోటి ప్రయాణీకులకి మిమ్మల్ని మీరు పరిచయం చేసుకోండి. ఒకొక్కరూ ముందుకి వచ్చి మైక్‌లో మీ పేరు, ఎక్కడ నించి వచ్చారు, మీ వృత్తి మొదలైనవి చెప్పండి" దీపక్ కోరాడు.

అంతా తమని తాము పరిచయం చేసుకున్నారు.

"1994లో గుజరాత్ నించి నలుగురు ఆడవాళ్ళ బృందం హిమాలయాలకి ట్రెక్కింగ్‌కి వెళ్ళారు. వారిలో నేను ఒకదాన్ని" వర్షా దేశాయ్ చెప్పింది.

"నా పేరు సుశీలా బేన్. బరోడా సమీపంలోని ఇటోలా నించి వచ్చాను" మరొకామె చెప్పింది.

తర్వాత ఈమె హిందీ పాటలు పాడింది.

"నేను కలకత్తా నించి వచ్చాను. నా పేరు మధుమిత. రిలయన్స్ గ్రూప్‌లో పని చేస్తున్నాను. నేను సింగిల్ పేరెంట్‌ని. పన్నెండేళ్ళ క్రితం మా వారు విమానప్రమాదంలో మరణించారు. నేను యానిమల్ లవర్ని. మేనకా గాంధీతో కలిసి పనిచేసాను" వయసు ఏభైదాకా ఉన్న ఆమె చెప్పింది.

అధునాతనంగా ఉన్న ఈమె సిగరెట్స్ తాగేది.

"నా పేరు మహేంద్ర పాటిల్. మాది జాయింట్ ఫేమిలి. మా ఇంట్లో ముప్పైమంది కుటుంబ సభ్యులు ఉన్నారు." పాటిల్ చెప్పాడు.

"నేను అమెరికానించి వచ్చిన బృందంలో ఉన్నాను. నా పేరు రోనక్ సీమా. యూనివర్శిటీ ఆఫ్ కొలరేడోలో ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసాను. నాకు మొత్తం మూడు మాస్టర్స్ డిగ్రీలు ఉన్నాయి."

"నా పేరు చిత్రా దేశాయ్. నేను కూడా అమెరికానించే వచ్చాను. అక్కడ AT&Tలో మేనేజర్‌గా పనిచేస్తున్నాను. మా వారి తరఫున కూడా నేనే చెప్తున్నాను. ఆయన వెల్స్‌ఫార్గో బేంక్‌లో పనిచేస్తున్నారు. మావారు 1977లో ఇండియాలో లార్సన్ అండ్ టూబ్రోలో పని చేస్తూండగా రిజైన్ చేసి అమెరికాకి వెళ్ళారు."

"నా పేరు జయదేవ్. నా స్వగ్రామం బళ్ళారి. బెంగుళూర్లో డైవర్స్ లాయర్‌గా పనిచేస్తున్నాను. మా ఆవిడ టీచర్. సెలవలు దొరక్క తను రాలేదు. ఇటీవల సమాజంలో విడాకులు అధికమయ్యాయి. చిన్న కారణాలకి కూడా యువతీయువకులు విడాకులకి వెళ్తున్నారు."

"నేను ఢిల్లీనించి వచ్చాను. నా పేరు బ్రిజ్ నందన్ గుప్తా. నాకు ఢిల్లీలో ఫేక్టరీలు ఉన్నాయి. వాటిని నా కొడుక్కి అప్పచెప్పేసాను. నాకు పర్యాటకం ఇష్టం. ఈ ట్రిప్ అయ్యాక ఎస్.ఓ.టి.సితోనే అమెరికాకి ట్రిప్‌ని బుక్ చేసుకున్నాను" గుప్తాజీ చెప్పారు.

మా గ్రూప్ మొత్తానికి జెంటిల్‌మేన్ గుప్తాజీ మాత్రమే. అందరితో సఖ్యతగా ఉన్నాడు.

ఇలా అంతా పరిచయం చేసుకున్నాక దీపక్ తన గురించి చెప్పాడు. పూర్తిపేరు దీపక్ సావంత్. అతను ముంబైలో సెటిలైన మహారాష్ట్రియన్. ఎస్.ఓ.టి.సిలో టూర్ మేనేజర్‌గా చాలాకాలంగా పనిచేస్తున్నాడు. అనేక దేశాలు సందర్శించాడు.

చివరగా డ్రైవర్ పరిచయం చేసుకున్నాడు. అతని పేరు జాన్ ఇవన్. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు.

ఉదయం 11.20కి మా కోచ్ పోర్చుగల్ ప్లాజా బయట ఆగింది. నియమం ప్రకారం డ్రైవర్ విశ్రాంతి తీసుకునే సమయం అది.

"నలభై నిమిషాల లంచ్ బ్రేక్. దయచేసి ప్లాజాలోకి వెళ్ళి షాపింగ్ చేయకండి. టైం లేదు" దీపక్ చెప్పాడు.

లాస్ మెజోస్ అనే చిన్న రెస్టరెంట్‌లో ఇద్దరం చెరో స్మాల్ వెజ్ పీజాని తిన్నాం. ఒకోటి ఎనిమిది యూరోలు. కోక్ జీరో ఒకోటి యూరో అరవై సెంట్స్. సరిగ్గా పన్నెండుకి మళ్ళీ బస్ బయలుదేరింది. కొందరు తమతో తెచ్చిన ఆహార పదార్థాలని ఇతరులకి పంచారు. మహేంద్ర పాటిల్ అనే అతను జాబ్బన్స్ కింగ్ జీరా శెనగలని అందరికీ పంచారు. జయదేవ్ మాకు గోధుమ రవ్వ, చక్కెర కలిపిన పొడిని, జూసీగా ఉన్న ఖర్జూరపు పళ్ళని ఇచ్చాడు.

"మళ్ళీ టైం మారింది. మీ గడియారాన్ని ఓ గంట ముందుకి జరిపి మూడుంపావుగా అడ్జస్ట్ చేసుకోండి."

దివ్యకాంత్ హిందీ పాటలు పాడాడు. అంత్యాక్షరి ఆడారు. హిందీ పాటలు రాని జయదేవ్, మిస్టర్ అండ్ మిసెస్ విశ్వనాథన్, మేము అందులో పార్టిసిపేట్ చేయలేకపోయాం కానీ ఎంజాయ్ చేసాం.

"ఇంకొద్దిసేపట్లో మనం హోటలకి చేరుకుంటాం. రిలాక్స్ అయి ఆరుంపావుకి లాబీలో నన్ను కలవండి. మనం ఆడిటోరియంలోని స్పేనిష్ డేన్స్ ఫ్లెమెంకో చూడటానికి వెళ్తాం" దీపక్ చెప్పాడు.

దారిలో ఒకరు యూరప్‌లోని ఆ రోడ్లని, శుభ్రంగా ఉన్న గ్రామాలని చూసి నాతో చెప్పారు.

"తూర్పు తూర్పే. పడమర పడమరే. యూరప్‌లోని హోటల్ గది బాత్‌రూంలో నీళ్ళు పట్టుకుని తాగచ్చు. మనదేశంలో అలా తాగితే డిసెంట్రీ పట్టుకుంటుంది. ఎప్పటికి ఇండియా ఈ స్థితికి చేరుకుంటుందో కదా?"

"తప్పు చేసిన ప్రభుత్వాధికారికి శిక్షపడకుండా తప్పించుకుంటే అప్పుడు అది ట్రైనింగ్ ఎక్సర్‌సైజ్ అయి, అది చట్టం ఇచ్చే బహుమతి అనుకుంటాడు. విద్య ఉండి కష్టపడి సంపాదించేవారు కట్టే టేక్స్‌ల్లోంచి విద్య, ఉద్యోగం లేనివారికి ఉచితాలుగా వెళ్తున్నాయి తప్ప అవి దేశాభివృద్ధికి ఉపయోగించడం లేదు. చైనాలో క్రూరమైన నియంతృత్వం వల్ల కలిగే ప్రయోజనాలని అక్కడి ప్రజలు అనుభవిస్తున్నారు. ఇండియాలో ప్రజాస్వామ్యం ఇచ్చే హీనమైన అప్రయోజనాలని మనం అనుభవిస్తున్నాం. ఇండియాలో ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతీ వందరూపాయల్లో నలభై ఆరున్న రూపాయలు లంచగొండుల జేబుల్లోకి వెళ్తున్నాయని చదివాను. అందులో ప్రతీ ముప్పైన్నర రూపాయలు ప్రభుత్వోద్యోగులకి, మిగిలినదంతా రాజకీయ పార్టీలకి, నాయకులకి వెళ్తోందిట." చెప్పాను.

"నా సంపాదనలో ఆ అడ్డగాడిదలకి నెలనెలా భాగం పంచుతున్నాను. జపాన్‌లో ఫోర్త్ గ్రేడ్ దాకా పరీక్షలు ఉండవు. థర్డ్ గ్రేడ్ దాకా నాలెడ్జ్‌ని పరీక్షించడానికి కాక వారిలో మంచి కేరక్టర్ని పెంపొదిస్తారు. అక్కడ రైల్లో పర్స్ పడిపోతే ఒక్క ఎన్ కూడా మిస్సవ్వకుండా దాని యజమానికి చేరుతుందని చదివాను. మనకి మరో దౌర్భాగ్యం కూడా ఉంది. ఏభై మూడు శాతం మార్కులతో డాక్టర్ కోర్స్‌లో చేరిన వ్యక్తి పక్కన తొంభై మూడున్నర శాతం మార్కులు వచ్చి డాక్టర్ కోర్స్‌లో చేరిన వ్యక్తి పనిచేయాల్సి వస్తోంది. త్వరలో తక్కువ మార్కులవాడు ఎక్కువ మార్కులవాడికి బాస్ అవుతాడు. రిజర్వేషన్ మహత్యమిది" అతను వాపోయాడు.

"ఇండియాలో జీవితం కష్టంగా మారడానికి కారణం ఇండియా ఇంకా వలస రాజ్యమే. బ్రిటిష్ ప్రభుత్వ స్థానంలో కాంగ్రెస్ లేదా బిజెపి, లేదా టియంసి లేదా మరోటి, ఇంకోటి వచ్చి కూర్చుంటాయి. పోలీసులంటే భయం. ప్రభుత్వాధికారులంటే భయం. దబాయించి పని చేయించుకోలేము. ప్రశ్నించాలంటే భయం. తెల్లవారికి ఆనాడు ప్రజలు వేటికి భయపడ్డారో ఈనాడు కూడా వాటికి భయపడుతున్నారు."

మా కాలక్షేపం అలా సాగింది. ఇది కొత్తకాదు. విదేశాలని సందర్శించే దాదాపు పర్యాటకులంతా విదేశం చూసాక అకస్మాత్తుగా ఇండియా గురించి మాట్లాడి బాధపడటం, రాజకీయ నాయకుల్ని తిట్టడం నా ప్రతీ పర్యటనలో జరుగుతూనే ఉంది. కానీ వెనక్కి వెళ్ళాక బహుశ అదంతా మర్చిపోతారు.

జపాన్‌లో ఇటీవల డ్రైవర్లకి ఓ కొత్త ప్రయోజనాన్ని ప్రవేశపెట్టారు. కారు వెనక రెండు రంగుల గుర్తులని ప్రవేశపెటారు. ఆకుపచ్చ, పసుపురంగు గుర్తులున్న కారు వృద్ధులు నడిపే కారని గుర్తు. ఆరెంజ్, ఎరుపు గుర్తులున్న కారుని డ్రైవ్ చేసేవారికి లైసెన్స్ వచ్చి ఏడాది నిండలేదని గుర్తు. మిగతా డ్రైవర్లు ఈ గుర్తులని చూసి ఆ కార్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఈ పద్ధతిని ప్రవేశపెట్టారు. ఇలాంటిది మీరు మన పాలకులకి సూచించి చూడండి. చేస్తే దాన్ని పట్టించుకోరు. వాళ్ళది ఒన్ ట్రాక్ మైండైపోయింది. దీనికి మనకి ఓట్లు రాలతాయా? లేదా? పోనీ మనకి ఎంత కమిషన్ ముడుతుంది. బస్. మిగిలినవాటికి వారు తమ సమయాన్ని కేటాయించారు.

448 కిలీమీటర్లు ప్రయాణించాక మా కోచ్ 4.40కి సెవిల్‌లోని హోటల్ వెర్టిస్ అల్‌జరాఫ్‌కి చేరుకుంది.

## సెవిల్

దీన్ని స్పానిష్ భాషలో సెవిల్లా అంటారు. స్పెయిన్‌లోని అండలూసియా ప్రావిన్స్‌కి ఇది రాజధాని. స్పెయిన్ లోని నాలుగో పెద్ద నగరం. ఇక్కడ 7 లక్షల జనాభా ఉంది. రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, కళలకి ఇది చాలా ముఖ్యమైన నగరం.

దీని చరిత్ర యూరప్‌లో పురాతనమైంది. ఇది గాడల్‌క్వివర్ నది ఒడ్డున ఉంది. అరబిక్ ప్రభావం గల ఈ నగరంలో సన్నటి వీధులు, పార్క్‌లు, హిస్టారిక్ సెంటర్ ఉన్నాయి. ఫ్లెమెంకో నృత్యం పుట్టిన ఊరిది. కేథలిక్, ఇస్లాం ఆర్కిటెక్చర్ స్టైల్ ఐన ముడేజార్ ఆర్కిటెక్చర్ ఇక్కడ ఉద్భవించింది. సెవిల్‌ని 500 ఏళ్ళు పాలించిన ముస్లింలని కేథలిక్స్ ఓడించారు. అప్పటినించి ముస్లిం మతం ఇక్కడ సమసిపోయింది. ముస్లిమ్స్ నిర్మించిన అల్కాజార్ పేలస్, గిరాల్డాలాంటి వాటిని పడగొట్టకుండా ఉంచేసారు. సెవిలానోస్ అనే స్థానిక అనధికారిక మాండలీకాన్ని సెవిల్ పౌరులు మాట్లాడుతారు. దీన్ని స్పెయిన్ వాళ్ళే అర్థం చేసుకోవడం కష్టం. ఇక్కడ నించి అండలూసియాలోని ఇతర పర్యాటక ప్రాంతాలకి ఉదయం వెళ్ళి రాత్రికి తిరిగి రావచ్చు.

దీపక్ రిసెప్షనిస్ట్ నించి తాళం చెవులు తీసుకుని ఎవరిది వారికి ఇచ్చాడు. మా రూం నంబర్ 232.

లిఫ్ట్‌లో అంతా ఎక్కాక అధిక బరువు వల్ల కదలకపోతే నేను బయటకి వచ్చేసాను. మేము ఎక్కువసేపు హోటల్ గదిలో లేము. సామాను గదిలో పెట్టి మొహం కడుక్కుని బయటకి వచ్చి రోడ్ మీద కొద్దిసేపు తిరిగి, హోటల్ లాబీకి ఆరుంపావుకి చేరుకున్నాం. ఆరున్నరకి బస్ ఫ్లెమెంకో ఆడిటోరియం బయలుదేరింది.

థియేటర్లో మాకు చివరి సీట్లు దొరికాయి. బీర్, వైన్, కోక్ అమ్ముతున్నారు. సరిగ్గా ఏడుకి షో మొదలైంది. స్పానిష్ సంస్కృతిలో ఫ్లెమెంకో డేన్స్, బుల్‌ఫైట్ ప్రధానమైనవి. ఫ్లెమెంకో డేన్స్, సంగీతం అండలూసియా ఏరియాలో ఆవిర్భవించి స్పెయిన్ అంతా పాకాయి. అండలూసియాలోని జిప్సీ (ఫ్లెమెంకో) మూరిష్ (ముస్లింలు) అండలూసియన్ (స్థానికులు) కలిసి దీనికి ఆద్యులు. ఐతే ఇది ఎలా ఆరంభమైందో అనేక అనుమానాలు ఉన్నాయి. ఆఫ్రికా నించి వచ్చిందని కూడా కొందరు అంటారు. 19వ శతాబ్దంలో స్థానిక బార్‌లు, క్లబ్‌లలో వినోదంగా ఈ నృత్య ప్రదర్శనలు తప్పనిసరిగా జరుగుతూండేవి. సెవిల్ ఈ డేన్స్‌కి ప్రసిద్ధి. ఇక్కడ చాలా ఫ్లెమెంకో క్లబ్స్ ఉన్నాయి. ఇవన్నీ పర్యాటకుల కోసమే.

ఐదుగురు అబ్బాయిలు, నలుగురు అమ్మాయిలు కలిసి నృత్యం చేసారు. వారిలో ఇద్దరు గిటారిస్ట్‌లు. ఈ స్పానిష్ డేన్స్‌లో బూట్లతో నేలని తంతూ నలుగురూ ఒకే రిథంతో డేన్స్ చేసారు. అబ్బాయిలు నలుపు. తెలుపు సూట్‌ని, అమ్మాయిలు పింక్ రంగు కుచ్చుల గౌన్లని ధరించారు. ఆడవాళ్ళ చేతుల్లో విసనకర్రలు, మగాళ్ళ చేతుల్లో బుల్‌ఫైట్‌కి ఉపయోగించే ఎర్రటి స్కార్ఫ్‌లు ఉన్నాయి. (యు ట్యూబ్‌లో మీరు సెర్చ్ చేసి ఈ నృత్యాన్ని చూడచ్చు)

అనేక బేచ్‌లు వచ్చి నృత్యం చేసాక చివర్లో కళాకారులంతా వచ్చి స్టేజ్ మీద నిలబడ్డారు. అంతా చప్పట్లు చరిచి అభినందనలు తెలియచేసాక 8.30కి షో పూర్తైంది. ఆ థియేటర్ సావనీర్ షాప్‌లో ఆరు యూరోలకి ఫ్లెమెంకో డేన్స్ చేసే స్పానిష్ యువజంట బొమ్మని కొన్నాం. 8.40కి బస్ రాగనే ఎక్కి తొమ్మిదికి ద మార్టెస్ ఏ డెమింగో ఏరియాలోని తాజ్‌మహల్ హోటల్‌కి డిన్నర్‌కి చేరుకున్నాం. ఇది మధ్యాహ్నం 1నించి 5 దాకా, రాత్రి 8 నించి 12 దాకా తెరచి ఉంటుంది. టేక్ ఎవే, హోం డెలివరీ సర్వీస్ కూడా ఉంది.

ఎప్పటిలా వెజ్ సలాడ్, పుల్కాలు, పెసరపప్పుతో చేసిన దాల్, బంగాళాదుంపల కూర, శెనగలు, పాలకూర కలిపిన కూర, నిమ్మకాయ ఊరగాయ, అప్పడం, పెరుగు. అన్నం సరిగ్గా ఉడకలేదు. రాత్రి పదికి హోటల్‌కి బయలుదేరాం.

"రేపు మీ లక్కీ నంబర్లు 7-8-9. ఏడుకి వేకప్ కాల్. ఎనిమిదికి బ్రేక్‌ఫాస్ట్. తొమ్మిదికి రూమ్ ఖాళీచేసి మీ సామానుతో సహా కోచ్‌లో ఉండాలి" దీపక్ దారిలో చెప్పాడు.

బాగా ప్రయాణం చేయడం వల్ల అలసటతో పడుకోగానే వెంటనే నిద్రపట్టేసింది.

15-9-2015

ఎప్పటిలా మొబైల్ అలారం మోగడంతో ఏడుకి లేచాను. ఎనిమిదీ పదికి బ్రేక్‌ఫాస్ట్ హాల్‌కి లిఫ్ట్‌లో థర్డ్ ఫ్లోర్‌కి చేరుకున్నాం. ఇది కాంటినెంటల్ బ్రేక్‌ఫాస్ట్. అమెరికన్ బ్రేక్ ఫాస్ట్‌లో ఉండేటన్ని ఐటమ్స్ కాంటినెంటల్‌లో ఉండావు. శాకాహారంలో నాకు బాగా ఇష్టమైన హేష్‌బౌన్స్(బంగాళాదుంపలతో చేస్తారు) బ్రెడ్, జామ్, పళ్ళు, ప్రూన్స్, డ్రైడ్ ఏపిల్‌కాట్, టీ, కాఫీ, ఆరెంజ్ జ్యూస్ ఉన్నాయి. యూరప్, అమెరికాల్లో ఆరెంజ్ జ్యూస్ విరివిగా, చవకగా దొరుకుతుంది. అది ఆర్టిఫిషియల్ కాక ఆరెంజ్ పండునించి తీసిందే అయి ఉంటుంది. వారి బ్రేక్‌ఫాస్ట్‌లో పాలు లేదా ఇది తప్పనిసరిగా ఉంటుంది. తొమ్మిదికి మా సామానుతో లాబీలోకి వెళ్ళేసరికి మా స్థానిక గైడ్ జోన్స్ దీపక్‌తో పాటు వేచి ఉన్నాడు. 9.05కి కోచ్ బయలుదేరింది. 9.30కి టవరాఫ్ గోల్డ్‌కి చేరుకున్నాం. అది ఫొటో స్టాప్ మాత్రమే.




"మీరు దక్షిణ స్పెయిన్‌లో సెవిల్‌లో చూడబోయేది టొరేడెల్ ఆర్వో. అంటే టవర్ ఆఫ్ గోల్డ్ అని అర్థం. ఇది 118 అడుగుల ఎత్తైన మిలటరీ వాచ్ టవర్. 13వ శతాబ్దంలో సెవిల్ గవర్నర్ అల్‌మహమద్ కేలిపతి గ్వాడల్‌క్వివర్ నది మీద ప్రయాణించే ఓడలని కంట్రోల్ చేయడానికి దీన్ని నిర్మించాడు. శత్రు ఓడలు రాకుండా టవర్ నించి నీటిలో బలమైన గొలుసుని అవతలి ఒడ్డుదాకా కట్టారు. అల్కజార్ పేలస్, మిగిలిన సెవిల్‌ల మధ్య వీరు ఓ గోడని కూడా నిర్మించారు. తర్వాత దీన్ని జైల్‌గా కూడా ఉపయోగించారు. సున్నపురాయి, గడ్డితో నిర్మించిన దీని ప్రతిబింబం రంగులో కనిపించడంవల్ల దీనికి టవరాఫ్ గోల్డ్ అనే పేరు వచ్చింది. మరో కారణం అండలూసియా లేటిన్ అమెరికన్ కాలనీల ఐశ్వర్యం వల్ల దీనికి టవర్ ఆఫ్ గోల్డ్ అనే పేరు వచ్చింది. ఓడలు నది మీద సెవిల్‌కి చేరుకున్నాక తమ కార్గోని, (బంగారం) ఇక్కడికి చేర్చేవారు. ఇది గోడౌన్‌గా ఉండేది. మధ్య భాగం జైలుగా పని చేసేది" జోన్స్ వివరించాడు.


గైడ్ జోన్స్

టవర్‌లో మూడు లెవెల్స్ ఉన్నాయి. అల్‌మహద్ కేలిపతి మొదటి లెవల్‌ని నిర్మించాడు. పీటర్ ఆఫ్ కేస్టిల్ 14వ శతాబ్దంలో రెండో లెవెల్‌ని నిర్మించాడు. 1755లో వచ్చిన భూకంపంలో ఇది నాశనమైంది. ఆ తర్వాత మిలటరీ ఇంజనీర్ థర్డ్ లెవెల్‌ని కూడా నిర్మించాడు. ఆ ఆవరణలోని ఎనిమిది కోణాల టవర్ కూడా అప్పుడే నిర్మించారు. ఆ టవర్ పై అంతస్థులోని చిన్న మేరీ టైం మ్యూజియంలో ఆనాటి పురాతన ఓడలకి చెందిన పరికరాలు, స్కేల్ మోడల్స్, సీ మేప్స్‌లని చూడచ్చు. అక్కడ నించి నది కూడా చక్కగా కనిపిస్తుంది. గోల్డెన్ టవర్‌కి ప్రవేశ రుసుము మూడు యూరోలు. పర్యాటకులు సెవిల్‌లో చూసేవాటిలో ఇదొకటి.


జ్యూయిష్ క్వార్టర్

అంతా ఫోటోలు తీసుకున్నాం. ఓ జంట లేటవడంతో అరగంట ఆలస్యంగా 10.45కి బయల్దేరి బేరియో ద శాంతా క్రూజ్ అంటే, జ్యూయిష్ క్వార్టర్‌కి వెళ్ళాం. ఇది సెవిల్‌లో టూరిస్ట్ సెంటర్. మేజ్‌లా ఉండే సన్నటి సందులు, అక్కడక్కడా పర్యాటకులతో నిండిన స్క్వేర్స్‌లో రెస్టరెంట్స్ కనిపించాయి.

"ఒకప్పుడు ఇక్కడ యూదులకి ఇచ్చాడు. వారక్కడ స్వతంత్రంగా జీవించేవారు. కానీ 14వ శతాబ్దంలో క్రిస్టియానిటీలోకి మారనివారిని వెళ్ళగొట్టారు. లేదా చంపారు. 1429కల్లా యూదులంతా మాయమైపోయాక ఇది నిర్మానుష్యంగా మారింది. అప్పట్లో జూయిష్ క్వార్టర్స్, ముస్లిం క్వార్టర్స్ అని రెండుండేవి. ఇప్పుడు ఇక్కడ 99% మంది కేథలిక్స్, 1% ముస్లిమ్స్ ఉన్నారు. యూదులు లేరు. అక్కడో టొబాకో ఫేక్టరీ ఉండేది. ఇప్పుడది యూనివర్సిటీ బిల్డింగ్. క్రిస్టియన్ ప్రపంచంలో ఇది మూడో పెద్ద కేథలిక్ నగరం" మా గైడ్ జోన్స్ చెప్పాడు.

తర్వాత అల్కజార్‌కి (స్పానిష్ భాషలో కోట - ఇది అరబిక్ పదం అల్ ఖస్ర్ నించి వచ్చింది) వెళ్ళాం. పాత ఆర్కిటెక్చర్‌తో అది చాలా పెద్ద సముదాయం.

"అల్కజార్ రాయల్ పేలెస్. 913లో ఇక్కడ రోమన్ కోట ఉండేది. అబ్దార్ రెహ్మాన్ దాన్ని పడకొట్టి ఈ ప్రదేశంలో మరో కోటని నిర్మించాడు. అల్ మోతాంబిడ్ (మొహమ్మద్) 11వ శతాబ్దంలో దీన్ని పెంచాడు. కింగ్ ఆల్ఫోన్స్ - 10 ఆఫ్ కేస్టల్ దీన్ని 14 శతాబ్దంలో మూర్స్ నించి జయించి దానికో పేలస్‌ని 1364లో నిర్మించాడు. దీన్ని ముడేజార్ ఆర్కిటెక్చర్‌లో నిర్మించారు. కింగ్ ఫిలప్ ఇక్కడికి వచ్చినప్పుడు ఇందులోనే బస చేస్తాడు. లోపల మూడు తోటలు ఉన్నాయి. అరబిక్ ప్రభావంతో స్పెయిన్‌లో సెరామిక్ టైల్స్ వాడకం వచ్చింది. అది వీటి నిర్మాణాల్లో కనిపిస్తుంది" గైడ్ వివరించాడు.

అక్కడ నించి షుమారు ఇరవై నిమిషాలు నడిచి కేథడ్రిల్ ఆఫ్ సెవిల్‌కి వెళ్ళాం. లోపలకి వెళ్ళాక గైడ్ జోన్స్ దాని గురించి వివరించాడు.

"సెవిల్‌లో సైట్ సీయింగ్స్‌లో ఇది చాలా ముఖ్యమైంది. ఇది యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్. దీని పొడవు 416 అడుగులు, 272 అడుగుల అడ్డం, 141 ఎత్తు. ఇది ప్రపంచంలోని మూడో పెద్ద కెథడ్రిల్. మొదటి రెండు రోమ్‌లోని కేథడ్రిల్ ఆఫ్ పీటర్స్ బసిలికా, లండన్‌లోని సెయింట్ పాల్ కెథడ్రిల్. ఒకప్పుడు మూరిష్ మసీదు ఉన్న చోట దీన్ని పదమూడొవ శతాబ్దంలో నిర్మించారు. 1403లో నిర్మాణం ఆరంభించి 1507లో పూర్తి చేసారు."

చాలా రిచ్‌గా ఉన్న రాయల్ చూపించి చెప్పాడు.

"ఇక్కడ 44 ఛాపెల్స్ ఉన్నాయి. అంటే ప్రైవేట్ ప్రార్ధనా స్థలాలని చెప్పచ్చు. వెయ్యి విగ్రహాలు కూడా ఉన్నాయి. 1248లో మూర్స్ నించి సెవిల్‌ని గెలుచుకున్న కింగ్ ఫెర్డినాండ్ -3 ఆఫ్ కేస్టిల్‌కి అంకితం ఇవ్వబడింది. ఇక్కడ అతిపెద్ద ఆర్గాన్ ఉంది. 18వ శతాబ్దపు దీనికి ఆరువేల పైప్స్ ఉన్నాయి. అమెరికాని ఎవరు కనిపెట్టారో తెలుసా?" అడిగాడు.

"క్రిస్టఫర్ కొలంబస్" చాలామంది చెప్పారు.

"అతని సమాధి ఈ కెథడ్రిల్‌లోనే ఉంది. ఆయన క్యూబా రాజధాని హవానాలో మరణించాక అక్కడ ఖననం చేసారు. కానీ 1898లో ఆయన అవశేషాలని ఇక్కడికి తెచ్చారు. కొందరు చెప్పడం అది అతనిది కాకపోవచ్చుని. కానీ ఋజువులు లేకుండా అంత గుడ్డిగా, అంతటి ప్రముఖుడి దేహాన్ని తరలించేంత మూర్ఖులు కాదు వాళ్ళు."

నిజం దేవుడికే తెలియాలి అనుకున్నాను. అది ఎవరిదైనా ఆ గౌరవం దక్కేది, అంతా గుర్తు తెచ్చుకునేది క్రిష్టఫర్ కొలంబస్‌నేగా.

కొలంబస్ అవశేషాలు నలుగురు వ్యక్తులు భుజాన మోసే కంచు శవపేటికలో ఉన్నాయి. పక్కనే చేతిలో కర్ర పట్టుకున్న అతని పెద్ద చిత్రం కూడా గోడకి ఉంది. ఈ సమాధి వెనక తలుపులోంచి లోపలకి ఆ శవపేటికని తెచ్చినట్లుగా, సింబల్‌గా బయటకి ఉన్న ఓ తలుపు ముందు దీన్ని ఉంచారు. ఆ తలుపుని మూసేసారు.

"ఆ నలుగురు ఆ నాటి నాలుగు మహా సామ్రాజ్యాలు కేస్టిల్, లియోన్, ఆరగాన్, నవార్‌లని రిప్రజెంట్ చేస్తారు." గైడ్ చెప్పాడు.

వారి ఛాతీల మీద ఆ నాటి ఆ సామ్రాజ్యాల చిహ్నాలు కూడా ఉన్నాయి. చరిత్ర మీద ఆసక్తిలేనివారు తర్వాతి అయిదు పేరాలని వదిలి చదవచ్చు.

15వ శతాబ్దంలో ఐబీరియన్ పెనున్సులా లోని పోర్చుగల్ జనాభా పది లక్షలు. తొలిసారిగా పోర్చుగల్ నావికులు 1341లో ఆఫ్రికా తీరానికి వాయువ్య దిశలోని కేనరీ ఐలాండ్స్‌ని కనుక్కున్నారు. తర్వాత స్పెయిన్ దీన్ని ఆక్రమించింది. పోర్చుగల్ రాజు జాన్ -ఆ దృష్టి ముస్లిమ్స్ గల మొరాకో దేశంలోని బంగారం, సుగంధద్రవ్యాల మీదకి మళ్ళింది. ఫలితంగా 1415లో పోర్చుగీస్ నావికాదళం స్ట్రెయిట్ ఆఫ్ జిబ్రాల్టర్‌ని దాటి బలమైన కోటలు గల మొరాకో ఓడరేవు సియుటాని ఆక్రమించుకుంది.

జాన్ - 1 కొడుకు ప్రిన్స్ హెన్రీకి హెన్రీ ది నేవిగేటర్ అనే ముద్దు పేరు రావడానికి కారణం అతను నావికుడు కాదు. నౌకానిర్మాణం, మేప్‌లని రాయడం, సముద్రయానంకి ఓ స్కూల్‌ని స్థాపించి నావికులకి ప్రోత్సాహం ఇచ్చి వారు నలుదిక్కులకి వెళ్ళడానికి ఆర్థిక మద్దతుని ఇవ్వడం చేసేవాడు. దాని 'ఏజ్ ఆఫ్ డిస్కవరీ' అని పేరు. పోర్చుగల్‌ని బంగారం, సుగంధద్రవ్యాలు, బానిసలతో సుసంపన్నం చేయడం, క్రిష్టియానిటీని ప్రవేశపెట్టడం హెన్రీ ధ్యేయం. ఫలితంగా 'ఇన్‌కా, టయానో, అజ్‌టెక్' సంస్కృతులు మాయమయ్యాయి. ఆఫ్రికన్ బానిసల వ్యాపారాన్ని ఆరంభించింది కూడా హెన్రీనే. 1460లో మరణించే నాటికి హెన్రీ పోర్టో సాంటో, మదైరాణ, అజోర్స్ లాంటి ద్వీపాల్లో పోర్చుగీస్ కాలనీలని స్థాపించాడు.

అతని మరణానంతరం కింగ్ జాన్ -2 పోర్చుగీస్ రాజయ్యేదాకా నావికులకి ప్రోత్సాహం లేదు. తిరిగి జాన్ -2 1487లో పోర్చుగల్ నించి ఇండియాకి నీటి మార్గం కనుక్కోవాలని అనుకున్నాడు. బార్టొలో ముడయాస్ ఆ ప్రయత్నంలో 170 మందితో, నాలుగు ఓడల్లో బయలుదేరి కేప్ ఆఫ్ గుడ్ హోప్‌ని చుట్టి, మే 1948లో కేలికట్ తీరానికి చేరుకున్నాడు. 1512లో స్పైస్ ఐలండ్స్ (ఇండోనేషియా)కి 1514లో చైనాకి పోర్చుగల్ నావికులు జలమార్గాన్ని కనుగొన్నారు. త్వరలోనే లిస్బన్ ఓడరేవుకి ఇండియానించి దాల్చిన చెక్క, అల్లం, నల్ల మిరియాలు, కుంకుమపువ్వులాంటి విలువైన సుగంధద్రవ్యాలు గల ఓడలు రాసాగాయి. ఫలితంగా పదహారవ శతాబ్దంలో నావికుల వల్ల పోర్చుగల్ యూరప్‌లో సంపన్నదేశమైంది.

బార్టొలో అంతకు మునుపు దక్షిణాఫ్రికా టిప్ దాకా వెళ్ళి తిరిగి వచ్చాడు. రాజసభలో అతను చెప్పిన కథలని, సాహసాలని విని ప్రేరణ పొందినవారిలో క్రిష్టఫర్ కొలంబస్ ఒకరు. బార్టొలో స్పైస్ ఐలాండ్స్‌కి (ఇండోనేషియా) పశ్చిమం నించి దారిని కనుక్కోవాలని అనుకున్నాడు. కానీ పోర్చుగల్ కింగ్ మేన్యువల్ - 1 ధన సహాయం చేయకపోవడంతో


కొలంబస్ టాంబ్

కొలంబస్‌లా అతనూ స్పెయిన్ రాజుని ఆశ్రయించాడు. ఇండోనేషియాకి దారి కనుక్కున్నాక బార్టొలో ముడయాస్ 1522లో ఫిలిప్పైన్స్‌లో మరణించాడు. కాని అతని ఓడలు తిరిగి స్పెయిన్ చేరడంతో భూగోళాన్ని తొలిసారిగా చుట్టిన ఘనత వాటికి దక్కింది.

లిస్బన్‌లో నౌకాయానంలో శిక్షణ పొందిన కొలంబస్ పోర్చుగీస్ మహిళని పెళ్ళిచేసుకున్నాడు. పశ్చిమం వైపు ప్రయాణించి ఇండియాని కనుగునే మార్గం మీద జాన్ -2కి ఆసక్తిని కలిగించే ప్రయత్నం చేసాడు కానీ అది ఫలించక పోవడంతో కొలంబస్ స్పెయిన్ రాణి ఇసబెల్లా, రాజు ఫెర్డినాండ్‌లని ఆశ్రయించాడు. 1494లో బహమాస్, క్యూబా, హైతీ, డొమినికన్ రిపబ్లిక్‌లని కనుగొని తిరిగి వచ్చాడు.

తమ మధ్యపోటీ, స్పర్థల వల్ల నష్టపోకూడదని స్పెయిన్, పోర్చుగల్ బేరగాళ్ళు స్పానిష్ ఊరు టోర్ డెసిల్లాలో జూన్ 1494లో కలుసుకుని ఓ ఒప్పందం కుదుర్చుకున్నారు. న్యూ వరల్డ్‌గా పేరు పెట్టి కనిపెట్టిన ప్రపంచాధిపత్యాన్ని పంచుకున్నారు. ఫలితంగా బ్రెజిల్‌ని వదిలేస్తే లేటిన్ అమెరికన్ దేశాలన్నీ స్పెయిన్ ఆధీనంలోకి వచ్చాయి. అట్లాంటిక్ ఓషన్‌లో పోర్చుగల్ ఆధీనంలోని కేప్ వర్డే ద్వీపానికి 100 ఫాదమ్స్ (345 మైళ్ళు) తూర్పు నించి పశ్చిమం వైపు అట్లాంటిక్ ఓషన్ మీద మేప్‌లో ఓ గీత గీసి పశ్చిమం వైపు స్పెయిన్, తూర్పు వైపు పోర్చుగల్ పంచుకుని తమ కాలనీలని ఏర్పాటు చేసుకున్నాయి. వీరు యూరప్‌లోని నావికాదళాలు గల బ్రిటన్, ఫ్రాన్స్, హాలండ్‌లని ఈ ఒప్పందానికి పిలవలేదు. ఫలితంగా వారి మధ్య పరాయిగడ్డ మీద కొన్ని ఆధిపత్య యుద్ధాలు జరిగాయి.

ఇలా వారి స్వదేశాలకి చేరిన, ప్రపంచ నావికుల్లో ముఖ్యమైన ఇద్దరు ఎక్స్‌ప్లోరర్స్ సమాధులని చూసాం. ఆ ఇద్దరికి, ఇండియాకి సంబంధం ఉండటం విశేషం. ఇండియాకి సముద్రమార్గం కనిపెట్టిన వాస్కో డ గామా (పోర్చుగల్ లోని లిస్బన్‌లో) ఇండియాకి మరో దారిని కనుక్కోడానికి బయలుదేరిన క్రిస్టఫర్ కొలంబస్ (స్పెయిన్‌లోని సెవిల్‌లో)

ఈ కేథడ్రెల్ చాలా అద్భుతంగా, ఎంతో వైభవంగా ఉంది. ఛాప్టర్ హౌస్‌లో గోయా, మ్యూరిలో, పెడ్రో ద కేంపనా, లూయిస్ ద వార్గాస్ లాంటి ప్రముఖులు గీసిన చిత్రాలు, మ్యూరల్స్ ఉన్నాయి. ఇక్కడ ఇనప ముళ్ళ కిరీటం గల జీసస్ పాలరాతి విగ్రహం ఉంది. ఇక్కడ ట్రెషరీ కూడా ఉంది. ప్రదర్శనలో ఉంచిన వాటిలో కొన్ని పురెలు, రెండు పెద్ద తాళం చెవులు మొదలైనవి ఉన్నాయి. కింగ్ ఫెర్నాండోకి మూరిష్, జూయిష్ కమ్యూనిటీస్ లొంగిపోతూ ఈ ట్రెషరీ తాళం చెవులని ఇచ్చారు. మే అల్లా రెండర్ ఎటర్నల్ డొమినియన్ ఆఫ్ ఇస్లాం ఇన్ ది సిటీ అని అరబిక్ భాషలో రాసిన అక్షరాలు గోడకి ఉన్నాయి.

"మసీదులోని ఆరెంజ్ కోర్ట్‌ని, గిరాల్డా టవర్‌ని మాత్రం అలాగే ఉంచేసారు. 341 అడుగుల ఎత్తు గల దీని మీదకి ఎక్కి నగరాన్ని వీక్షించచ్చు. కానీ ఎవరూ ఎక్కకండి. మనకంత సమయం లేదు. మెట్లులేవు. కానీ గుర్రాలు ఎక్కడానికి రేంప్ ఉంది. దీని మీద 13 అడుగుల ఎత్తైన గిరాడిల్లో అనే ముద్దు పేరు గల విగ్రహం ఉంది. ఇది గాలికి కదులుతుంది. అందుకే దీనికి గిరాల్డా అనే పేరు వచ్చింది. గిరాల్డా అంటే వాతావరణ సూచిక అని అర్థం" జోన్స్ వివరించాడు.

బయటకి వచ్చేసరికి 12.45 ఐంది.

"జాగ్రత్త. జేబు దొంగలు ఉంటారు" జోన్స్ మమ్మల్ని హెచ్చరించాడు.

లంచ్‌కి దీపక్ సన్నటి సందుల్లో మమ్మల్ని నడిపించుకుని ఓ రెస్టారెంట్. మెనూ కార్డ్ చూసి వెజిటేరియన్ ఐటమ్స్‌లో 9 యూరోలకి పీజా మార్గరీటాని చెరొకటి తిన్నాం. చాలా రుచిగా చేసారు. ఆరెంజ్ జ్యూస్ ఒక యూరో. భోజనంతోపాటు యూరప్, అమెరికాల్లో మంచినీళ్ళు తాగరు. వైన్, బీర్, కోక్‌లాంటి సాఫ్ట్ డ్రింక్ లేదా ఫ్రూట్ జ్యూస్‌లు తాగుతారు. మా గ్రూప్‌లోని కొందరు బీర్ తాగారు.

ఆ రెస్టారెంట్ సమీపంలో ఒంటినిండా వెండి రంగు పూసుకుని, చేతిలో బేట్ పట్టుకున్న ఓ బిచ్చగాడు విగ్రహంలా నిలబడ్డాడు. మన దేశంలోలా దగ్గరకి వచ్చి అడుక్కోకుండా ఇలా ఓ విద్యని ప్రదర్శించి అడుక్కోవడం కూడా తెల్లవాళ్ళున్న దేశాల్లో గమనించాను. నేను నా దగ్గరున్న ఒక యూరో ఇరవై సెంట్లని అతని ముందున్న టోపీలో వేసాను.

ఇక్కడ రొమేనియన్ కాందిశీకులు ఎక్కువ. అది చూసి ఓ రొమేనియన్ కాందిశీకుడు నా దగ్గరకి వచ్చాడు. మురికి బట్టలు. కాళ్ళ బూట్లు చిరిగి ఉన్నాయి. తనకి జబ్బు చేసిందని, మందులకి డబ్బవసరమని ఇంగ్లీష్‌లో కోరాడు. పక్కనే మందులషాపు కనిపించడంతో నాతో వస్తే కొనిస్తానంటే డబ్బే కావాలని చెప్పాడు. అతనికో యూరో ఇస్తే తక్షణం ఓ కాందిశీకుల గుంపు వచ్చి నన్ను చుట్టుముట్టింది. వారి నించి తప్పించుకున్నాక కానీ పద్మజ కుదుటపడలేదు. మీదపడి హేండ్ బేగ్ లాక్కుంటారేమోనని భయపడింది. పొట్ట చేతపట్టుకుని మరో దేశానికి వలస వచ్చిన వాళ్ళంతా అంత బీదగా ఉన్నారు.

స్పెయిన్, పోర్చుగల్ దేశాలు ఒకప్పుడు ప్రపంచ వ్యాప్తంగా కాలనీలని స్థాపించిన సంపన్న దేశాలు. కానీ నేడవి యూరప్‌లో బీద దేశాలు. (యుకె, ఫ్రాన్స్, జర్మనీ, స్విడ్జర్లాండ్ మొదలైనవి యూరప్‌లోని సంపన్నదేశాలు)

1.40కి అంతా బస్ దగ్గరకి చేరుకున్నాం. చాలామంది సైకిళ్ళని ఉపయోగిస్తున్నారు. రోడ్‌కి అటు ఇటు ఉన్న ఆరెంజ్ చెట్లకి పిందెలు వచ్చాయి. పర్యాటకుల కోసం గుర్రపు బగ్గీలు చాలా కనిపించాయి. మా బృందంలోని ఒకామె తప్పిపోవడంతో ఆమె భర్త, దీపక్ ఆమెని వెదకడానికి వెళ్ళడంతో అంతా నీళ్ళు రాని ఓ ఫౌంటెన్ తిన్నె మీద కూర్చుని వేచి చూసాం. 2.15కి, దాదాపు ముప్పావు గంట ఆలస్యంగా 210 కిలోమీటర్ల దూరంలోని మాలాగాకి బయలుదేరి సాయంత్రం 4.55కి చేరుకున్నాం.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***